RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:90

శనివారం
మార్చి 21, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260






లింగబత్తిని కృష్ణ
సీఎండీ & చీఫ్ ఎడిటర్
వేద న్యూస్
తెలుగు దినపత్రిక
9701923260

గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని

## చక్కదిద్దుతూ కొత్త ప్రణాళిక

- జాతీయ వృద్ధి రేటు కంటే 2.7 శాతం అధికంగా తెలంగాణ వృద్ధి నమోదు
- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం
- వ్యవసాయం, విద్యకు పెద్ద పీట వేసిన రేవంత్ సర్కార్



2లో

# ప్రజా బడ్జెట్!

రైతు సంక్షేమం, వ్యవసాయం
**రూ. 23,179 కోట్లు**

పంచాయతీ రాజ్ శాఖకు
**రూ. 33,688 కోట్లు**

విద్య, వైద్యం, మానవ వనరులు
**రూ. 40వేల కోట్లు**

రాజీవ్ యువ వికాసం
**రూ. 6,000 కోట్లు**

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం
**రూ. 22,615 కోట్లు**

## రెండు కళ్లుగా అభివృద్ధి.. సంక్షేమం

## రూ. 3,24,234 కోట్లుతో 2026-27 తెలంగాణ బడ్జెట్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తూ, అగ్రస్థానమే లక్ష్యంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రకటించింది. శాసనసభ వేదికగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ. 3,24,234 కోట్లతో ప్రతిష్టాత్మకమైన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేవలం అంకెల గారడీ కాకుండా, సామాన్యుడి సంక్షేమం – రాష్ట్ర సమగ్ర అభివృద్ధే రెండు కళ్లుగా ఈ ప్రణాళికను తీర్చిదిద్దారు. గత ప్రభుత్వ ఆర్థిక అస్తవ్యస్తతను సరిదిద్దుతూ, పారదర్శకమైన 'ప్రజల పాలన'కు ఈ బడ్జెట్ అద్దం పడుతోంది. జాతీయ సగటు కంటే 2.7 శాతం అధిక వృద్ధి రేటుతో దూసుకుపోతున్న తెలంగాణ, 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. రైతుకు భరోసా, పల్లెకు వికాసం, యువతకు ఉపాధి, మరియు సామాజిక న్యాయమే పునాదులుగా రూపొందించిన ఈ బడ్జెట్, తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టే దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగు.

## చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

- ఆరు గ్యారెంటీలు, నిరుద్యోగ భృతిపై నిలదీత
- సభలో స్పీకర్ పోడియం వద్ద ఆందోళన, వాకౌట్
- నిరుద్యోగులు, మహిళలను ప్రభుత్వం వంచిస్తోందని ధ్వజం



2లో

## ఇది దగా బడ్జెట్

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్




## మహాలక్ష్మి ఏమైంది ?

- తులం బంగారం ఎంతమందికి ఇచ్చారు?
- స్కూటీలు, నగదు సాయం ఎవరికి చేశారు
- ప్రభుత్వ హామీలపై మహిళల నిరసన
- హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

2లో

## ఈవో గారూ.. ఇదేం బుద్ధి

### దేవుడి సొమ్ముకే శఠగోపం..?

- శాశ్వత కల్యాణం టికెట్లలో స్కామ్
- దేవాదాయ శాఖలో దుమారం..
- ఓ ఈవోపై పలు ఆరోపణలు
- అక్రమాలపై ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు?




**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

దేవాదాయ శాఖలో ఓ ఈవో గతంలో పనిచేసిన వరంగల్ ఆలయాల్లో శాశ్వత కల్యాణం టికెట్ల విక్రయాల్లో భారీ అక్రమాలకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 100 టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం అధికారిక రికార్డుల్లో (డే బుక్) నమోదు చేయకుండా, ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు మళ్లించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు సదరు రసీదు బుక్ పోయిందని రికార్డుల్లో నమోదు చేసి అధికారులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. వరుస వివాదాలకు కేంద్రబిందువుగా మారిన ఈ అధికారి తీరుపై భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలకు సంబంధించిన పక్కా ఆధారాలతో పలువురు ఇప్పటికే వరంగల్ జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. దేవుడి సొమ్మును దుర్వినియోగం చేసిన ఈ ఈవో వ్యవహారం ప్రస్తుతం శాఖలో సంచలనంగా మారగా, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



2లో

## భద్రకాళీ అమ్మవారికి లక్ష లిల్లీ పూలతో పుష్పార్చన

వేద న్యూస్
శనివారం | మార్చి 21, 2026

# ఇది దగా బడ్జెట్

## 6 గ్యారంటీలకు పాడె కట్టేలా ఉంది

- వరంగల్ జిల్లాకు పూర్తిగా న్యాయం జరగలేదు
- రెండో రాజధాని చేస్తామని.. అమలులో పూర్తిగా విఫలమయ్యారు
- ఎంజీఎం అభివృద్ధి, సూపర్ స్పెషలిటీకి రూపాయి కూడా కేటాయించలేదు
- ఎయిర్‌పోర్ట్, టెక్స్‌టైల్ పార్క్, జాతీయ రహదారుల అభివృద్ధిపై ఎలాంటి ప్రస్తావన లేదు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శలు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

ఈ బడ్జెట్ 6 గ్యారంటీలకు పాడె కట్టేలా ఉందని, ఇది మోసం, దగా, ప్రజా వంచనకు నిదర్శనమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తీవ్రంగా స్పందించారు. వరంగల్ జిల్లాకు పూర్తిగా న్యాయం జరగలేదని, ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి, సూపర్ స్పెషలిటీ హాస్పిటల్‌కు రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్‌ను రెండో రాజధానిగా చేస్తామని చెప్పి అమలులో మాత్రం పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్, టెక్స్‌టైల్ పార్క్, జాతీయ రహదారుల అభివృద్ధిపై ఎలాంటి ప్రస్తావన లేదని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో అంకెల ఆర్భాటం తప్ప ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఏవీ లేవని, రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసేలా మరో లక్ష కోట్ల వరకు అప్పు భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆయన అన్నారు. కేంద్ర నిధులపై ఆధార పడటం తప్ప రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేసిందేమీ లేదని విమర్శించారు. రైతు భరోసా రెండు విడతల చెల్లింపులు నిలిచిపోయాయని, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా మళ్లీ నిరాశ కలిగించారని పేర్కొన్నారు. మహిళలకు తులం బంగారం, రూ.2500 ఆర్థిక సాయం వంటి హామీలు అమలు కాలేదని, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ పెంపుపై ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. నిరుద్యోగ భృతి అంశం బడ్జెట్‌లో లేకపోవడం, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డుకు నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి కేటాయింపుల కంటే బకాయిలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. విద్యారంగానికి 16 శాతం నిధులు కేటాయించాలని కమిషన్ సూచించినప్పటికీ, 8 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమన్నారు. దేవాదాయ శాఖకు గతంలో కేటాయించిన నిధులకంటే ఈసారి ప్రస్తావన లేకపోవడం, పుష్కరాల కోసం తగిన నిధులు లేకపోవడం ఆందోళనకరమని తెలిపారు. బీసీలకు తక్కువ నిధులు కేటాయించారని, ఎస్సీ, ఎస్టీల పట్ల కూడా అన్యాయం జరిగిందని అన్నారు. వరంగల్ జిల్లాకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై జిల్లా మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. గల్లీలో గొప్పలు చెప్పడం తప్ప వరంగల్‌కు రూపాయి కూడా తీసుకురాలేదని తీవ్రంగా విమర్శించారు.

# దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్

## వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ ఆయుబ్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**



పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ ఆయుబ్ ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ దీవెనలతో జిల్లా, రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు, సకల శుభాలు కలగాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం దాతృత్వం, క్రమశిక్షణ, ధార్మిక చింతనల సమ్మేళనమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు ముస్లింలు కఠిన దీక్షతో అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని తెలిపారు. అల్లా కరుణ, దయ, కృపతో ముస్లిం సోదర సోదరీమణులు రక్షణ పొందాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను అందరూ సోదరభావంతో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# భద్రకాళీ అమ్మవారికి లక్ష లిల్లీ పూలతో పుష్పార్చన

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**



చారిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన వరంగల్ నగరంలోని భద్రకాళీ దేవస్థానంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 27 వరకు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికాలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి లక్ష లిల్లీ పూలతో పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వెంకటనాగరాజ శర్మలు, వేద విద్యార్థులు నిర్వహించారు. ఈ పుష్పార్చనకు వరంగల్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి సురినేని నవీన్ రావు–నీరజ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వసంత నవరాత్రి సందర్భంగా నిర్వహించే ఈ లక్ష పుష్పార్చనలో పాల్గొని భక్తులు అమ్మవారి కృప పొందాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, గాండ్ల స్రవంతి, పాలడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా బడ్జెట్!

## రూ. 3,24,234 కోట్లుతో 2026-27 తెలంగాణ బడ్జెట్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**



- శాసనసభ వేదికగా ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క
- జాతీయ వృద్ధి రేటు కంటే 2.7 శాతం అధికంగా తెలంగాణ వృద్ధి నమోదు
- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం
- వ్యవసాయం, విద్యకు పెద్ద పీట వేసిన రేవంత్ సర్కార్
- రైతు సంక్షేమం, వ్యవసాయ రంగానికి రూ. 23,179 కోట్లు
- పంచాయతీ రాజ్ శాఖకు అత్యధికంగా రూ. 33,688 కోట్ల
- విద్య, వైద్యం, మానవ వనరుల అభివృద్ధికి రూ. 40వేల కోట్లకు పైగా నిధులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి భారీగా నిధులు
- రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఉపాధికి రూ. 6వేల కోట్లు.
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం రూ. 22,615 కోట్ల నిధులు.
- గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దుతూ కొత్త ప్రణాళిక

హైదరాబాద్‌లోని శాసనసభ వేదికగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారు. మొత్తం రూ. 3,24,234 కోట్ల భారీ వ్యయంతో రూపొందించిన ఈ బడ్జెట్, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దిక్సూచిలా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక అస్తవ్యస్తతను సరిదిద్దుతూ, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి భట్టి ఉద్ఘాటించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై మంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. జాతీయ సగటు వృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధి రేటు 2.7 శాతం ఎక్కువగా ఉండటం రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం గడచిన కాలంలో గణనీయంగా 1.9 రెట్లు పెరిగి, ప్రస్తుతం రూ. 4,18,931 కి చేరుకోవడం గర్వకారణమని తెలిపారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే కాకుండా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### అన్నదాతకు భరోసా.. సాగునీటికి పెద్దపీట

వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు బడ్జెట్‌లో రూ. 23,179 కోట్లను కేటాయించారు. రైతు సంక్షేమ పథకాలు, రుణమాఫీ వంటి అంశాలకు ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించనున్నారు. అదేవిధంగా, సాగునీటి రంగానికి రూ. 22,615 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. విద్యుత్ రంగానికి రూ. 21,285 కోట్లు కేటాయించడం ద్వారా రైతులకు మరియు పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు హామీ ఇచ్చారు.

### గ్రామీణ వికాసం.. మౌలిక వసతులు

ఈ బడ్జెట్‌లో అత్యధిక నిధులు పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు దక్కాయి. ఏకంగా రూ. 33,688 కోట్లు కేటాయించడం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి హామీ పథకం అమలును బలోపేతం చేయనున్నారు. పట్టణాభివృద్ధి, పురపాలక శాఖకు రూ. 17,907 కోట్లు, రవాణా శాఖకు రూ. 12,759 కోట్లు కేటాయించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గృహ నిర్మాణ రంగానికి రూ. 7,430 కోట్లను ప్రత్యేకించారు. ఐటీ రంగానికి రూ. 875 కోట్లు, పరిశ్రమలకు రూ. 3,490 కోట్లు కేటాయించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేశారు.

### విద్య, వైద్యం, మానవ వనరుల వికాసం

ప్రభుత్వం విద్య మరియు వైద్య రంగాలకు ఈసారి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. విద్యా శాఖకు రూ. 26,674 కోట్లు కేటాయించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మరియు నాణ్యమైన విద్యపై దృష్టి సారించారు. వైద్య రంగానికి రూ. 13,679 కోట్లు కేటాయించి, సామాన్యులకు అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేయనున్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కల్పన కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా రూ. 6వేల కోట్లను ప్రభుత్వం కేటాయించడం విశేషం.

### సామాజిక న్యాయం.. సంక్షేమ పథకాలు

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ అంకెలను రూపొందించారు. ఎస్సీ సంక్షేమానికి రూ. 11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 7,937 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 12,511 కోట్లు, మైనారిటీల కోసం రూ. 3,769 కోట్లు కేటాయించి సామాజిక సమతుల్యతను కాపాడారు.

సివిల్ సప్లై కోసం రూ. 7,366 కోట్లు కేటాయించి పేదలకు ఆహార భద్రతను నిర్ధారించారు. న్యాయ శాఖకు కూడా రూ. 2,367 కోట్లు దక్కాయి. చివరగా, రాష్ట్ర ద్రవ్య లోటును రూ. 58,458 కోట్లుగా అంచనా వేస్తూ, తెలంగాణను ఒక సంక్షేమ రాష్ట్రంగా మరియు ఆర్థిక శక్తిగా మార్చే దిశగా ఈ బడ్జెట్ అడుగులు వేస్తుందని మంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగాన్ని ముగించారు.

# చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నేడు అత్యంత ఉత్కంఠ భరితంగా, వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించగానే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఊహించని రీతిలో నిరసనకు దిగింది. ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ తమ చెవుల్లో రంగురంగుల పూలు పెట్టుకుని సభలోకి రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికే ఈ వినూత్న నిరసన చేపట్టామని వారు పేర్కొన్నారు. మంత్రి భట్టి విక్రమార్క ప్రసంగం కొనసాగుతుండగానే, బీఆర్ఎస్ సభ్యులు ఒక్కసారిగా స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని, నిరుద్యోగ భృతి హామీని ఎందుకు అమలు చేయడం లేదని వారు గట్టిగా నిలదీశారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ సభలో పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. భట్టి విక్రమార్క ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన అనంతరం, నిరసన తెలుపుతూ బీఆర్ఎస్ నేతలు సభ నుండి వాకౌట్ చేశారు. సభ నుండి బయటకు వచ్చిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ గేట్ వద్ద బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు సంధించారు. ముఖ్యంగా మహిళా సంక్షేమంపై స్పందిస్తూ, పెళ్లి చేసుకునే ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేయడం పేద మహిళలను వంచించడమేనని ధ్వజమెత్తారు. ప్రభుత్వం మాట తప్పిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత మరియు నిరుద్యోగుల అంశంపై కూడా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని, లక్షలాది మంది నిరుద్యోగ యువతను నట్టేట ముంచిందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడం దారుణమని మండిపడ్డారు. ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమేనని, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేకూరే లబ్ధి ఏమీ లేదని వారు విమర్శించారు.

# గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వారు విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని ఆగం చేశారని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇవ్వాల్సిన రూ.54వేల బాకీ ఎక్కడ అని నేతలు ప్రశ్నించారు. వృద్ధులకు నెలకు రూ.4వేల చొప్పున ఇవ్వాల్సిన సాయం కూడా అందడం లేదని తెలిపారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఇవ్వాల్సిన సహాయం రెండు సంవత్సరాలకు రూ.24వేలగా బాకీ పడిందని ఆరోపించారు. ఈ వర్గాలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నేతలు నిలదీశారు. నిరుద్యోగ భృతి ఎక్కడుందని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడం కూడా నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. యువత, మహిళలు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్ర సంపదను దోచుకుంటూ ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై కేంద్రం ఉక్కుపాదం

## 300 కొత్త ప్లాట్‌ఫామ్‌లు బ్లాక్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలను మరింత వేగవంతం చేసింది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి మొత్తం సంఖ్య 8,400కు చేరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బ్లాక్ చేసిన ప్లాట్‌ఫామ్‌లలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ యాప్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటి క్యాసినో గేమ్‌లు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. అదనంగా సట్టా, మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు వినియోగదారులను మోసం చేస్తూ భారీ ఆర్థిక నష్టాలకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత ఏడాది పార్లమెంట్ ఆమోదించిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం కింద ఈ చర్యలు చేపడుతున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లు బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం నిజమైన డబ్బుతో గేమ్‌లు నిర్వహిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు విధించనున్నారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడం, యువత వ్యసనాలకు గురవడం, కొన్నిసార్లు ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది.

# మహాలక్ష్మి ఏమైంది?



**వేద న్యూస్, ఆదిలాబాద్**

రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలకు సంబంధించిన హామీలు నెరవేరలేదని అదిలాబాద్ జిల్లాలో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ హామీలపై స్పష్టత లేకపోవడం మహిళల్లో అసంతృప్తి పెంచిందని తెలిపారు. అదిలాబాద్ జిల్లా ముఖరా గ్రామంలో మహిళలు ఒకచోట చేరి బడ్జెట్ సమావేశాలను వీక్షించారు. ఈసారి అయినా తమకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయేమోనని ఆశించారు. అయితే బడ్జెట్‌లో తమ సమస్యలకు ప్రాధాన్యం లేకపోవడంతో నిరాశ చెందామని తెలిపారు. మహిళలకు మళ్లీ మొండి చెయ్యి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఆడబిడ్డకు స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదని మహిళలు పేర్కొన్నారు. యువతీ విద్యార్థినుల ప్రయాణ సౌకర్యాల కోసం ఈ పథకం ఉపయోగపడుతుందని భావించామని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. హామీలు కేవలం ఎన్నికల సమయంలోనే గుర్తుకు వస్తున్నాయని ఆరోపించారు. గత రెండేళ్లుగా బడ్జెట్‌లో ప్రకటించిన విషయాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని మహిళలు అన్నారు. ఈసారి కూడా అదే పరిస్థితి కొనసాగిందని, తమ ఆశలు వమ్మయ్యాయని తెలిపారు. మహిళల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాద్దే మీనాక్షి, వైష్ణవి, అర్చన, అంతర, ప్రవళికతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వకపోతే పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.



# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎస్సై వంశీకృష్ణ
- రోడ్డు భద్రతపై అవగాహన.. సీసీ కెమెరాల ఏర్పాటు




**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం కాచి రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంతో పాటు సీసీ కెమెరాల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణ, అనుమానాస్పద కదలికల గుర్తింపు సులభమవుతుందని తెలిపారు. గ్రామ భద్రత కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ముగుస్తున్న రిజిస్ట్రేషన్ గడువు

- వెంటనే నమోదు చేసుకోవాలి
- ఈవీ శ్రీనివాస్ రావు పిలుపు



**వేద న్యూస్, హనుమకొండ:**

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఈ నెల 29న ఘనంగా నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, సుమారు 70 సంవత్సరాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొనదలచిన పూర్వ విద్యార్థులందరూ ముందస్తుగా నమోదు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,000ను సంఘం బ్యాంక్ ఖాతాలో జమ చేసి, తమ వివరాలను ఆర్గనైజింగ్ కమిటీకి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమ ఏర్పాట్ల కోసం హాజరయ్యే వారి సంఖ్యను ముందుగానే అంచనా వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 22 వరకు మాత్రమే నిర్ణయించినట్లు వెల్లడించారు. గడువు ముగియడానికి ఇంకా తక్కువ సమయం మాత్రమే ఉండటంతో, ఇప్పటివరకు నమోదు చేసుకోని పూర్వ విద్యార్థులందరూ వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్

- మంత్రి పొన్నం క్యాంపు ఆఫీస్ ముట్టడికి యత్నం
- జీతాలు పెంచాలని డిమాండ్

**వేద న్యూస్, హుస్నాబాద్:**




హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన ఆశా వర్కర్లు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ముట్టడికి బయలుదేరిన సమయంలో పోలీసులు వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం రూ. 9,900 మాత్రమే వేతనం అందుతుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, జీతాలను పెంచాలని ఆశా వర్కర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో అక్కన్నపేట పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆశా వర్కర్ల జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను వినిపించేందుకు వెళ్లిన తమను ఇలా అదుపులోకి తీసుకోవడం సరికాదని ఆశా వర్కర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోగ ప్రవీణ, శారద, అరుణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

- బడ్జెట్‌లో విద్యకు తక్కువ కేటాయింపులు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్

**వేద న్యూస్, కరీంనగర్:**



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శిం చారు. అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను పరిశీలిస్తే ప్రభుత్వానికి విద్య పట్ల చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం నిధులు మాత్రమే కేటాయించడం దారుణమని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో కనీసం 15 శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు తక్కువ నిధులు కేటాయించడం విద్యార్థులపై అన్యాయం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సరిపడా నిధులు కేటాయించకపోవడం ఆందోళనకరమన్నారు. ఉన్నత విద్యాసంస్థలకు, గురుకులాలకు తగిన నిధులు ఇవ్వకపోవడం వల్ల విద్యారంగం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా పాఠశాలల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించలేదని విమర్శించారు. డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన నిధులు లేకపోవడం విద్యా అభివృద్ధికి ప్రతికూలమని తెలిపారు. ఇలాగే విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే రానున్న కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉండదని హెచ్చరించారు.

# శ్రద్ధగా చదవాలి.. ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

- కలెక్టర్ గరిమా అగ్రవాల్
- గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, కిచెన్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, మెనూ చార్ట్‌ను పరిశీలిస్తూ విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. హాస్టల్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల మధ్య విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదవాలని, అన్ని పాఠ్యాంశాలను పునర్విమర్శ చేయాలని సూచించారు. మథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో



విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

# నిర్లక్ష్యానికి గురవుతున్న క్రీడా ప్రాంగణాలు



**వేద న్యూస్, గంగాధర:**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు నిర్లక్ష్యానికి గురైన దుస్థితికి చేరుకున్నాయి. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఈ మైదానాలు ప్రస్తుతం ఇతర అవసరాలకు వినియోగంలోకి మారుతున్నాయి. పంట కోత అనంతరం

- ఇతర పనులకు వినియోగం - క్రీడాకారులకు ఇబ్బందులు

కొంతమంది గ్రామస్థులు హార్వెస్టర్ వాహనాలను క్రీడా మైదానాల్లోనే నిలిపివేస్తుండటంతో క్రీడాకారులు, యువత ఆటలు ఆడేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల మధ్య ఆటలు ఆడాల్సిన పరిస్థితి నెలకొనడంతో అసౌకర్యం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాల సంరక్షణలో గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను ఖాళీ చేయించి, క్రీడాకారులకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మైదానాలకు కంచె ఏర్పాటు చేయడం, పరిశుభ్రత చర్యలు చేపట్టడం, అవసరమైన క్రీడా సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడా ప్రాంగణాలను పరిరక్షించడం ఎంతో అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# చావుదార్ చెరువు పోరాటం చారిత్రాత్మకం

- కౌన్సిలర్ గాదెపాక రవీందర్

**వేద న్యూస్, హుస్నాబాద్:**

చావుదార్ చెరువులోని తాగునీటి కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన పోరాటం ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన చారిత్రాత్మక ఘట్టమని కౌన్సిలర్ గాదెపాక రవీందర్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని మహద్ పట్టణంలోని చావుదార్ చెరువులో దళితులకు నీరు తాగే హక్కు కల్పిస్తూ డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 1927 మార్చి 20న చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జన జాగృతి కళా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. దేశంలో అంటరానితనం కారణంగా దళితులు ఎన్నో అన్యాయాలు ఎదుర్కొన్నారని తెలిపారు. త్రాగునీరు వంటి ప్రాథమిక హక్కులు కూడా నిరాకరించబడిన పరిస్థితుల్లో అంబేద్కర్ చేసిన పోరాటం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆ స్ఫూర్తితో దళిత, బహుజనులు ఏకమై సామాజిక, రాజకీయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో జన జాగృతి కళాసమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, నాయకులు కొయ్యడ కొమురయ్య, వెన్న రాజు, బోయిని రాజమల్లయ్య, బుర్ర శ్రీనివాస్, భాస్కర్ నాయక్, ఆరె కిషోర్, బెజ్జంకి విశ్వనాథం, పొన్నాల వినోద్ కుమార్, కోతి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో ఎంపీ ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో మాజీ మంత్రి, ప్రస్తుత మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, శనిగరం సర్పంచ్ కొత్తపెల్లి రాజు, బీజేపీ నాయకులు గంధసిరి రవికుమార్, మౌటం రమేష్ బాబు, కనుకుంట్ల అరవింద్, మేకల రవి, గొర్రె మధుసూదన్ రెడ్డి, చెలికె శ్రీనివాస్, రాజేశ్వరరావు, అశోక్, కుమార్, రమేష్, సాంబయ్య, కరుణాకర్ రెడ్డి, పిల్లి సతీష్, పిల్లి వినయ్, కొలిపాక తిరుపతి, ప్రసాద్, రంజిత్, శేఖరయ్య, సంపత్, సారంగం, బిక్షపతి, చంద్రయ్య, చందర్ సింగ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్

**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర మండలంలో జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా శుక్రవారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. కంప్యూటర్ రూమ్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులు, డార్మిటరీ, డైనింగ్ హాల్‌ను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అద్దె భవనంలో నడుస్తున్న పాఠశాలలో కొన్ని గదుల్లో ఫ్యాన్లు సరిగా పనిచేయకపోవడం గమనించి, వేసవిలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వెంటనే మరమ్మతులు చేయాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులకు ఆదేశించారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. రోజువారీ అవుట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సంఖ్య, ఔషధాల నిల్వలు, ప్రసూతి సేవల పరిస్థితిపై వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తులు, భూముల సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. 60 రోజులకుపైగా పెండింగ్ దరఖాస్తులు లేకుండా చూసుకోవాలని, కుల, ఆదాయ ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దీపిక, వైద్య అధికారి డా. శరత్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం మార్చి 21, 2026

# ఊర పిచుకలను కాపాడుకుందాం



- వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి ముంతలు ఏర్పాటు చేయాలి
- ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి పిలుపు

**వేద న్యూస్, హనుమకొండ:**

మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకృతి పర్యావరణ ప్రేమికురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి పిచ్చుకల సంరక్షణపై అవగాహన కల్పించారు. గత ఇరవై సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లలు మరియు పెద్దల్లో అవగాహన పెంపొందించడంలో ఆమె కృషి కొనసాగుతోంది. వేసవి కాలంలో పక్షుల దాహార్తి తీర్చేందుకు ఇంటి ప్రాంగణాల్లో, డాబాలపై నీటి ముంతలు ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచిస్తూ, వాటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంక్రీటు యుగంలో ఉరపిచుకలు అంతరించి పోతున్నాయని, వాటిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అడవులను రక్షించడం, చెట్లు నాటడం, రేడియేషన్ ఉన్న వస్తువుల వినియోగాన్ని తగ్గించడం, పక్షుల కోసం నీటి తొట్లతో పాటు ఆహారపు గింజలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతిని మనం కాపాడితేనే ప్రకృతి మనలను కాపాడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు సంపదగా కార్లు, బంగారం కాకుండా స్వచ్ఛమైన గాలి, నీరు, ప్రకృతిని అందించాలని చెప్పారు. చిన్నతనం నుంచే పిల్లల్లో ప్రకృతి పట్ల ప్రేమ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తన ఇంటి ఆవరణలో వందలాది చెట్లు నాటి, పక్షుల కోసం నీటి తొట్లు, ఆహారపు ఏర్పాట్లు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో, పరిసరాల్లో నీటి పాత్రలు, గింజలు ఏర్పాటు చేసి పిచ్చుకల సంరక్షణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా ఆర్ఎన్ రమేష్, కార్యదర్శిగా ఎస్ రాజు

**వేద న్యూస్, దేవరకద్ర/అమరచింత:**

అమరచింత మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.ఎన్. రమేష్, జిల్లా కార్యదర్శిగా ఎస్. రాజును ఎంపిక చేసినట్లు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మహిముద్, కామ్రేడ్ వేణుగోపాల్ తెలిపారు. జిల్లా కోశాధికారిగా ఏ. బుచ్చన్నను, ఉపాధ్యక్షులుగా సుజ్ఞానం, సుధాకర్, సామ్సన్‌ను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా మాణిక్యమ్మ, ప్రేమమ్మ, వెంకటన్న తదితరులతో మొత్తం 13 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. బీడీ కార్మికుల సమస్యలైన కూలీ రేట్ల పెంపు, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, గృహ వసతి వంటి అంశాల పరిష్కారానికి ఈ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ నెల 25న చిన్నచింతకుంటలో బీడీ కూలీ రేట్ల పెంపు కోసం డిమాండ్ నోటీసు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కామ్రేడ్ మహిముద్ పిలుపునిచ్చారు.




# శిలాఫలకం ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై బీఆర్ఎస్ ఫిర్యాదు

**వేద న్యూస్, తిమ్మాపూర్:**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నేదునూరు గ్రామంలో శిలాఫలకం ధ్వంసం చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు నేదునూరు సర్పంచ్ కనకం లక్ష్మీ కొమురయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో గ్రామానికి మహిళా సంఘ భవనం మంజూరై అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం భవన నిర్మాణం నిలిచిపోగా, ప్రస్తుత పాలకవర్గం ఉపాధి హామీ నిధులతో మళ్లీ నిర్మాణానికి చర్యలు తీసుకుందని చెప్పారు. భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఆహ్వానించగా, ఆయన సమక్షంలో పాత శిలాఫలకాన్ని గమనించిన కాంగ్రెస్ నాయకుడు బండారి రమేష్ దానిని ధ్వంసం చేశాడని ఆరోపించారు. ఈ ఘటనతో అక్కడున్న అధికారులు, మహిళలు, నాయకులు




ఆశ్చర్యానికి గురయ్యారని తెలిపారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు, ఎంపీడీవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సర్పంచులు ఎలుక ఆంజనేయులు, గాండ్ల శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వంద శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

- అధికారులకు మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు ఆదేశం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలను వంద శాతం వసూలు చేయాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పన్నులు వసూలు చేయాలని, జాప్యం సహించబోమని స్పష్టం చేశారు. పన్నుల వసూళ్ల సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, పన్నుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి పన్నులు కీలకమని, ప్రజలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు జోగినపల్లి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ విందులో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సౌహార్ద వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్, ఉప సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు. అలాగే మొహమ్మద్ హుస్సేన్, ఇస్మాయిల్, ఇబ్రహీం, లతీఫ్, హకీమ్, రఫీ, షాదుల్లా, అజిత్, రాగుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మైలారం అభిరామ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామానికి చెందిన మైలారం అభిరామ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు ఆనందంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిరామ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నానమ్మ గంగవ్వ, తాతయ్య కీ.శే. మైలారం దేవయ్య, అమ్మమ్మ దేవమ్మ, తాతయ్య చంద్రయ్య ఆశీర్వదించారు. తల్లిదండ్రులు విజయ-మహేష్.., పిన్ని, బాబాయ్ లక్ష్మినారాయణ -అఖిల, అన్న శ్రీరామ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అక్కలు శ్రీహర్షిణి, లక్ష్మిప్రసన్న, తమ్ముడు వర్షిత్ కుటుంబ సభ్యులతో కలిసి అభిరామ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



# కురుమూర్తి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

ఉగాది పండుగ సందర్భంగా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి స్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నూతన పంచాంగాన్ని పఠించి అన్ని రాశుల ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి దంపతులు, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పరాభవ నామ సంవత్సరం అందరికీ సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, దేవస్థానం పాలకమండలి సభ్యులు, భక్తజనులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్లింలకు తోఫా పంపిణీ

- పాల్గొన్న మండల అధ్యక్షుడు మాదిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి

**వేద న్యూస్, దేవరకద్ర:**



కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సోదర సోదరీమణుల కోసం రంజాన్ సందర్భంగా పంపిణీ చేస్తున్న 'ఈద్ కా తోఫా' గిఫ్ట్‌లను శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు మాదిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని గిఫ్ట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, ఉప సర్పంచ్ సలాం, కుర్వ మన్యం, రాజ్ మహమ్మద్, రాములు, నన్నే మియా, నహీద్, చంద్రయ్య, మాలాంగ్ మసీదు పెద్దలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి

- అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం అందించాలని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలను గుర్తించి గౌరవ వేతనం ఇవ్వాలని అన్నారు. వార్డు సభ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వార్డు సభ్యులకు ప్రత్యేక బీమా సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి అభివృద్ధికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బత్తిని అనిల్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఏర్పాట్లపై సమావేశం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27న జరగనున్న శ్రీరామనవమి కళ్యాణోత్సవం ఏర్పాట్లపై ఆలయ ఈవో ఎల్. రమాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బందితో సమావేశమై, భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. దర్శనం, తాగునీరు, ప్రసాదం, పార్కింగ్, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేలా సమన్వయంతో పనిచేయాలని ఈవో పేర్కొన్నారు.

# అక్రమ ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత..




**వేద న్యూస్, పోతంగల్ :**

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్ లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని మంజీర నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌ను కల్లూరు వద్ద పట్టుకొనీ పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

# ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ లక్ష్యం



– డాక్టర్ జ్యోతి

**వేద న్యూస్, నల్లబెల్లి:**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్లబెల్లి మండలం మేడపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో 233 మందికి ఓపీలు నిర్వహించగా, 92 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివాని (ఎంఎస్), శ్రీలక్ష్మి (ఆర్థో), స్వాతి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శంకర్ (ఎండి), మేడపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్)గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి డా.సంతోష్ కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో 98 ఆవులు, గేదెలుకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లి సాయి ప్రసాద్, పాడి రైతులు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**వేద న్యూస్, కోటగిరి :**



ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతుల కు వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని సిపిఐ నాయకులు విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాల యం ఎదుట దర్నా చేపట్టారు. ఈసందర్భంగా అంబటి విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షాలకు ఉమ్మడి పోతంగల్, కోటగిరి మండలాల్లో రైతంగం త్రీవ నష్టపో యారని, వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నల్లగంగాధర్, రాములు, శంకర్, రాజు, లక్ష్మణ్, దత్తు, శివరాజ్, హన్మాండ్లు, పోశెట్టి, గంగారం, రాములు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

– ప్రేమ,శాంతి,దానగుణానికి నిదర్శనం రంజాన్ : ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**వేద న్యూస్, సూర్యాపేట :**



రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.మత సామరస్యానికి ప్రతీక రంజాన్ నెల రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈనెల 21న జరిగే రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. రంజాన్ పండుగను సూర్యాపేట నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఐకమత్యానికి ప్రతీక అన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉందని, పవిత్ర రంజాన్ మాసం పరస్పర ప్రేమ, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింలందరూ రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు.పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అత్యంత నిష్టతో అల్లాను ప్రార్థిస్తారని తెలిపారు. ఆత్మీయతకు మారుపేరైన రంజాన్ ప్రజలందరికీ సుఖసంతో షాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు.సూర్యాపేట నియోజకవర్గ ముస్లిం సోదరులకు రంజాన్ శు భాకాంక్షలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**వేద న్యూస్ , కారేపల్లి :**

సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ లోని శ్రీ కోట మైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో ఆలయ చైర్మన్ పర్స పట్టాభి రామారావు విజయలక్ష్మి దంపతులు, పాల్గొని. విగ్నేశ్వర పూజ పుణ్య హావాంఛనము పంచ గన్య ప్రశన రక్షాబంధనం దీక్ష ధారణ అఖండ దేవా స్థానము, మంటప ఆరాధనలో తూత్ప జలాలు. మరియు, వేద పారాయణము సూర్య నమస్కారములు పీఠ పూజలు అగ్నిపత్తిష్ట ఆవాహిత దేవత హోమములు, లక్ష్మీ గణపతి హోమం, మహా విద్య పశుపత హోమము, నీరాజన మంత్ర పుష్పములు, దార్చారు సేవ నక్షత్ర హారతులు, తీర్థ ప్రసాదల తో పండితులు బ్రహ్మశ్రీ కోడా మంచిలి ఫణి కుమార్ శర్మ బృందం వారిచే నిర్వహించారు. అనంతరం, అన్నదాన కార్యక్రమం దాతలు డాక్టర్ రవి, డాక్టర్ కల్పన, కాకతీయ స్కూల్స్ ఇల్లందు దండ రామచందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కే. వేణుగోపాల్చార్యులు, ఆలయ అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం, కొత్తలంక శంకర్



శర్మ, జూనియర్ అసిస్టెంట్ పగడాల మోహన్ కృష్ణ, పర్స సాయి లలిత్, ఆలయ సిబ్బంది, మరియు భక్తులు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 39 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం..!

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



జిల్లా సివిల్ సప్లయ్ అధి కారి ( డీసీఎస్ఓ ) సిబ్బంది తో కలిసి అక్రమ ఎల్పిజి సిలిండర్ల నిల్వపై మూడు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 39 ఎల్పిజి సిలిం డర్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిల్వకు పాల్పడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేశారు. రఘునాథపాలెంలో మీసేవా కేంద్రంలో తనిఖీ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన 32 ఎల్పిజి సిలిండర్లు స్వాధీనం చేసుకోబడ్డాయి. మీసేవా ఆపరేటర్ అయిన జంగాల దుర్గారావు మీద అవశ్యక వస్తువుల చట్టం(ఈసీ ,యాక్ట్ )కింద 6ఏ కేసు నమోదు చేయబడింది. అదేవిధంగా ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్‌లో గల భవాని బిర్యాని హోటల్‌లో నిర్వహించిన తనిఖీలో వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న 3 గృహ వినియోగ సిలిండర్లను ఉపయోగించిన నేరానికి 6ఏ కేసు నమోదు చేయబడింది. రఘునాథపాలెంలోని సితారా హోటల్‌లో తనిఖీ జరిపి అక్రమంగా నిల్వ చేసిన 4 ఎల్పిజి సిలిండర్లు స్వాధీనం చేసుకోబడ్డాయి. హోటల్ నిర్వాహకుడిపై 6ఏ కేసు నమోదు చేయబడింది. ఈ సందర్భంగా వినియోగదారులకు అధికారులు కొన్ని సూచనలు చేశారు. వినియోగదారులకు గృహ అవసరాల కొరకు మాత్రమే సరఫరా అయ్యే ఎల్పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుకోవడం చట్టవిరుద్ధం. అలాంటి అక్రమ కార్యకలాపాలను గమనించిన వారు వెంటనే డిసిఎస్ఓ కార్యాలయానికి సమాచారం అందించవలసిందిగా కోరారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి డిజైన్లు సిద్ధం చేయాలి

– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**వేద న్యూస్,ఖమ్మం ప్రతినిధి :**

జిల్లా పరిధిలో ఎంపిక చేసిన 9 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా అభివృద్ధి చేసేందుకు డిజైన్స్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా 1000, 800 మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులను, మౌళిక వసతులు కల్పించేలా ప్రణాళిక చేయాలన్నారు.9 పాఠశాలల లే ఔట్ లను పరిశీలించి జి+1 పద్దతిలో అదనపు తరగతి గదులు, ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, సంప్, కిచెన్, వాష్ రూమ్, ఇతర మౌళిక వసతుల కల్పనకు ప్లాన్ ను సిద్ధం చేయాలన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి కోసం నిధులు నాబార్డ్ నుంచి వస్తాయని, నాబార్డ్ గైడ్ లైన్స్ కు అనుగుణంగా పాఠశాలలను అభివృద్ధి చేయాలని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ డిజైన్, ఉపయోగించే సామాగ్రి మంచి క్వాలిటీతో ఉండాలని, డిప్యూటీ సీఎం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారని, ఈ అంశాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. పబ్లిక్ స్కూల్స్ లో ఎంట్రీ గేట్, పార్కింగ్ ఏరియా, వివిధ భవనాలకు వెళ్లేందుకు మార్గాలు, ల్యాండ్ స్కేపింగ్, ప్రీ స్కూల్ బ్లాక్, గ్రౌండ్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ వంటి వివిధ అభివృద్ధి పనులతో కూడిన డిజైన్లు ప్రతి పాఠశాలకు రెండు నుంచి 3 వరకు అందించాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ డిజైన్ మాదిరిగా పబ్లిక్ స్కూల్స్ కు కామన్ డిజైన్ తయారు



చేయాలని, ప్రతి పాఠశాలకు క్షేత్రస్థాయిలో అవసరమైన మేర చిన్న, చిన్న మార్పులు చేసుకునే ఆస్కారం ఉంటుందని, ప్రతి తరగతి గదిలో మంచి వెలుతురు, గాలి వచ్చే విధంగా డిజైన్ చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత మండలంకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా చూడాలని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 9 పబ్లిక్ స్కూల్స్ ను తహసిల్దార్ పరిశీలించి అవసరమైన ల్యాండ్ సర్వే చేయించి, అందుబాటులో ఉన్న పాఠశాల భూమి సరిహద్దులు ఫిక్స్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్లు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఈఈ మహేష్ బాబు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ మెమో మిస్సింగ్..విద్యార్థి ఆందోళన

**వేద న్యూస్ , కారేపల్లి :**

సింగరేణి మండలంలోని భాగ్యనగర్ తండాకు చెందిన లకావత్ లక్ష్మీప్రసాద్ తన టెన్త్ మెమో పోగొట్టుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తండ్రి లకావత్ హిరాలాల్ తెలిపారు ప్రకారం, లక్ష్మీప్రసాద్ భాగ్యనగర్ తండా నుండి కారేపల్లి వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో టెన్త్ సర్టిఫికేట్ (హాల్ టికెట్ నంబర్: 2231111025) అనుకోకుండా ఎక్కడో పడిపోయింది. తరువాత మెమో కోసం వెతికినా దొరకకపోవడంతో, స్థానికులను విచారించినా ఎవరికి లభించలేదని తెలిసింది. దీంతో ఈ నెల 17న కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. విద్యా, ఉద్యోగ అవసరాలకు కీలకమైన ఈ పత్రం పోగొట్టుకోవడంతో విద్యార్థి ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. డూప్లికేట్ మెమో కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు అవసరమైన పత్రాలు సమర్పిస్తే కొంతకాలంలో డూప్లికేట్ మెమో అందించే అవకాశం ఉందని సూచించారు.అయితే, ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వీలైనంత త్వరగా టెన్త్ మెమో అందించాలంటూ విద్యార్థి, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



**వేద న్యూస్, రామడుగు:**

మండలంలోని గోపాల్రావుపేట గ్రామంలో పలు వాణిజ్య కేంద్రాల్లో జిల్లా పౌర సరఫరాల అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి ఐదు అక్రమ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గృహ వినియోగానికి ఉద్దేశించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను పవన్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ ఆన్నాడి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

వేద న్యూస్

శనివారం మార్చి 21, 2026

## గాయపడ్డ కార్యకర్తను పరామర్శించిన బండి సంజయ్

**వేద న్యూస్, రామడుగు:**



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన వనవాసి కళ్యాణ్ పరిషత్ సంఘ్ కార్యకర్త కల్లేపల్లి పరుషరాములను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జాటోత్ ఠాను నాయక్ 77వ వర్ధంతి

**వేద న్యూస్ ,కారేపల్లి:**




మండల కేంద్రంలోని కారేపల్లి బంజారా కాలనీలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, గిరిజన ముద్దుబిడ్డ జాటోత్ ఠాను నాయక్ 77వ వర్ధంతి వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. లంబాడి సంస్కృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు భూక్యా రామకోటి రాథోడ్ మరియు ఇతర సంఘ పెద్దలు పాల్గొని ఠాను నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గిరిజన చైతన్యానికి ఠాను నాయక్ స్ఫూర్తి ఈ సందర్భంగా లంబాడి సంస్కృతి పరిరక్షణ సమితి అధ్యక్షులు రామకోటి రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో గిరిజనుల హక్కుల కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీశాలి ఠాను నాయక్ అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగాలు వృథా పోకూడదని, నేటి తరం యువత ఆయన పోరాట పటిమను, ఆశయాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సంస్కృతిని కాపాడుకుందాం.. లంబాడీల విశిష్ట సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవడమే ఠాను నాయక్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అని సమితి సభ్యులు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో అణచివేతకు వ్యతిరేకంగా గళమెత్తిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బానోతు రాములు నాయక్, ధారావత్ రామ్జి నాయక్, శంకర్ నాయక్, చిన్నమల్లు, ఈర్య నాయక్, భావసింగ్, వీరు నాయక్,తదితరులు పాల్గొన్నారు గిరిజన సంఘాల నాయకులు పాల్గొని ఠాను నాయక్ అమర్ రహే అంటూ నినదించారు.

## ముస్లిం సోదర, సోదరీమనులకు రంజాన్ శుభాకాంక్షలు

### – కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**వేద న్యూస్,ఖమ్మం ప్రతినిధి:**



రంజాన్ పండగ నేపథ్యంలో ముస్లిం సోదరులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ అంటే ఉపవాసాలు, దైవారాధన, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించడం అని అన్నారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ సామరస్యానికి,సుహృద్భావానికి, సర్వమానవ సమన్వత్వానికి కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని అన్నారు. "అల్లాహ్ ఆశీర్వాదాలు మీపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజక బడ్జెట్ అని అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చే బడ్జెట్ అని అన్నారు. ఆర్థిక వ్యవస్థ పునర్జీవానికి పునాది వేసిందని,రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడం పై దృష్టి సారించారని,డాంబికాలకు పోకుండా వాస్తవిక దృక్పథంతో బడ్జెట్ ను రూపొందించారని, విద్య, వైద్యం,వ్యవసాయ,ఇందిరమ్మ ఇండ్లు, ఆరు గ్యారంటీల అమలుకు పెద్దపీట వేశారని, ఎస్సీ, ఎస్టీ, బిసి ల సంక్షేమానికి కేటాయించారని అదే విధంగా పేద ప్రజలకు అండగా ఉండే విధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా రూపు దిద్దారని ఉద్ఘాటించారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

**వేద న్యూస్, పాపన్నపేట :**




పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట శివారులో మెదక్ వైపు నుంచి బొడ్మట్ పల్లి వైపు వెళ్తున్న ఓ వ్యాన్ ను తనిఖీ చేయగా అందులో ఉన్న సుమారు 224 క్వింటాళ్ల పీడీఎస్ (చౌకబియ్యం) బియ్యం పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. వారి ఫిర్యాదు మేరకు బియ్యం తరలిస్తున్న అశోక్, డ్రైవర్ వెంకట్ రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎక్కడైనా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు

## విద్యుత్ ఘాతానికి రైతు మృతి

**వేద న్యూస్ హైదరాబాద్ :** విద్యుత్ ఘాతానికి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నజ్దిక్ సింగారం గ్రామానికి చెందిన పుణ్యమూర్తి అంజయ్య (50) విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందారు. గురువారం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు తీగలు తెగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంజయ్య శుక్రవారం ఉదయం బోరుబావి మోటర్ ను నడిపిద్దామని విద్యుత్ స్టార్టర్ డబ్బా వద్దకు వెల్లగా విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న అంజయ్య కు భార్య చంద్రమ్మ ఐదు మంది కూతుర్లు, అందులో నలుగురు పెళ్లి కాగా ఐదో కూతురు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు.అకాల మరణంతో గ్రామస్తులు బంధుమిత్రులు బాధ తో శోక సంద్రంలో మునిగిపోయారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అంజయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులు కోరారు.

## యుద్ధం వద్దు..శాంతి ముద్దు



**వేద న్యూస్, కారేపల్లి:**

మండల పరిధిలోని వెంకట్య తండాలో గల నిర్మల హైస్కూల్‌లో శుక్రవారం 'హార్మోనీ వీక్' (సామరస్య వారం) వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (హెచ్.ఎం) పెన్నిలా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థులలో సామాజిక స్పృహను, సోదరభావాన్ని పెంపొందించింది. ప్రపంచవ్యాప్త సంస్కృతులను ప్రతిబింబించేలా నిర్వహించిన వంటకాల ప్రదర్శన ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వంటకాలే వారధులుగా.. హార్మోనీ వీక్ నాలుగవ రోజు వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ ఖండాలకు చెందిన సాంప్రదాయ వంటకాలను ప్రదర్శించి, ఆయా దేశాల సంస్కృతులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా హెచ్.ఎం పెన్నిలా మాట్లాడుతూ.. "ఆహారం కేవలం ఆకలిని తీర్చేది మాత్రమే కాదు, అది విభిన్న సంస్కృతులను, మనసులను కలిపే ఒక అద్భుతమైన వారధి" అని కొనియాడారు. లోకంలో రుచులు వేరైనా, మానవత్వమనే హృదయం అందరికీ ఒక్కటేనని ఆమె విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వేడుకల ఉత్సాహంలో ఉంటూనే, ప్రపంచవ్యాప్తంగా యుద్ధం మరియు ఘర్షణలతో అల్లాడుతున్న దేశాల పట్ల పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థులు సానుభూతి వ్యక్తం చేశారు. ఉక్రెయిన్, రష్యా, ఇజ్రాయెల్, పాలస్తీనా, సూడాన్, మరియు యెమెన్ వంటి దేశాల్లో త్వరగా శాంతి నెలకొనాలని, అక్కడి ప్రజల కష్టాలు తీరాలని విద్యార్థులు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మనం ఇక్కడ స్వేచ్ఛగా, సంతోషంగా గడుపుతున్న వేళ, ప్రపంచంలోని మరెన్నో ప్రాంతాల్లో ప్రజలు కనీస రక్షణ కోసం ఎదురుచూస్తున్నారని, వారి పట్ల ప్రతి విద్యార్థి కరుణ కలిగి ఉండాలని ఉపాధ్యాయులు బోధించారు. వసుధైక కుటుంబకమే లక్ష్యం ద్వేషం ఉన్న చోట అవగాహన పెరగాలని, ప్రతి ఒక్కరూ ఒకే మానవ కుటుంబంగా కలిసి జీవించాలని ఈ కార్యక్రమం పిలుపునిచ్చింది. ప్రతి సంస్కృతిని గౌరవిస్తూ, ప్రతి వ్యక్తిని విలువైన వానిగా గుర్తించినప్పుడే నిజమైన సామాజిక సామరస్యం సాధ్యమవుతుందని హెచ్.ఎం పెన్నిలా స్పష్టం చేశారు. ఈ వేడుకలు విద్యార్థులలో ప్రపంచ శాంతి పట్ల మరియు మానవ సంబంధాల పట్ల గొప్ప ప్రేరణను నింపాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోడపత్రిక ఆవిష్కరణ



**వేద న్యూస్,కారేపల్లి :**

సింగరేణి మండలం కొత్తూరుతండాలో స్వయంభు వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం నందు శుక్రవారం శ్రీరామనవమి కళ్యాణ మహోత్స గోడ పత్రికలను ఆలయ అర్చకులు రవీందర్, సురేష్ స్వామీజీలు, చిన్నమడం పల్లి సర్పంచ్ భానోత్ పద్మరూప్ల నాయక్, ఉప సర్పంచ్ స్వర్ణలత, గ్రామ పెద్దలు ధరావత్ రాజునాయక్, బానోత్ లక్ష్మానాయక్, బానోద్ భాషా, జరపలా నెహ్రూ, సపవాట్ రవీందర్,మెట్ల అరవింద్, భానోత్ వీరభద్రు, ఇస్లావత్ యువరాజు, ధరావత్ ఉపేందర్, పండగ మురళీధర్, బానోత్ హేమంత్, సబా వట్ భధ్య,ధరావత్ నాగేశ్వరరావు, లకావత్ లక్ష్మలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ సురేష్ స్వామీజీలు మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి కొండకింది వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల శుక్రవారం 27న స్వామి వారి కళ్యాణం నిర్వాహించబడుతుందని తెలిపారు. 27వ తేదీ ఉదయం 5.15 గంటలకు ధ్వజ ఆరోహణ ఉదయం 9.15గంటలకు భోగ్ బండారో కార్యక్రమం మధ్యాహ్నం 12.05 నిమిషాలకు సీతారామ చంద్రస్వామి కళ్యాణం మధ్యాహ్నం ఒంటిగంటకు మహా అన్నదాన కార్యక్రమం సాయంత్రం 5.గంటలకు చక్రస్థానం 5.15 ధ్వజా అవరోహణ మరియు 6.15 నిమిషాలకు ఊరేగింపు భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణానికి కన్నులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారీ పాత్రులు కాగలరని కోరారు.

## అన్నారంలో ఘనంగా బోనాలు

**వేద న్యూస్, పాపన్నపేట :**



పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఉగాది పండగ పురస్కరించుకుని గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. తెలుగు సంవత్సరాది వేడుకలను ప్రత్యేకంగా జరుపుకుంటూ గ్రామ ప్రజలు శుక్రవారం ఘనంగా బోనాలు నిర్వహించారు.గ్రామంలోని అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మహిళలు బోనాలు ఎత్తి సంప్రదాయ వేషధారణలో ఊరేగింపుగా తీసుకెళ్లడం విశేషంగా నిలిచింది. ఉదయం నుంచే గ్రామంలో పండుగ సందడి నెలకొంది. అమ్మవారి ఆలయం పరిసరాలు మంగళవాయిద్యాలతో మారుమోగాయి.భక్తులు తమ కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఈవేడుకల్లో పాల్గొని భక్తి భావాన్ని చాటుకున్నారు. మహిళలు రంగురంగుల బట్టలతో,తలపై అలంకరించిన బోనాలతో ఊరంతా తిరుగుతూ పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.గ్రామ యువకులు,పెద్దలు ఏర్పాట్లలో చురుకుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం అలుముకుని,ప్రతి వీధి కళకళలాడింది. ఎటుచూసినా భక్తి,ఆనందం,ఉత్సాహం కనిపించాయి.ఉగాది సందర్భంగా నిర్వహించిన ఈ బోనాల పండుగ అన్నారం గ్రామ చరిత్రలో మరో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా రాణి సుధీర్,ఆయా గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా, గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

### – మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**వేద న్యూస్, పాపన్నపేట :**



జిల్లాలో యూరియా, గ్యాస్ కొరతను కృత్రిమంగా సృష్టిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రంలోని రైతు అగ్రో సెంటర్ తో పాటు ప్యాక్స్ యూరియా స్టాక్, గ్యాస్ గోదామును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులు, మందులు, గ్యాస్ బుకింగ్ కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలలో ఎలాంటి ఎరువులు, మందులు, గ్యాస్ కొరత లేదని స్పష్టం చేసిన ఆయన, కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నాగ్సన్ పల్లి ఉమాకేదారేశ్వర స్వామీ ఆలయ 43వ వార్షికోత్సవం

**వేద న్యూస్,పాపన్నపేట :**



నేడు పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్ పల్లి గ్రామ ఉమాకేదారేశ్వర స్వామీ ఆలయ 43వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సంతాయిపేట రాజ శేఖర్ శర్మ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం స్వామీ వారికి పుణ్యాహవచనం,రుద్రాభిషేకం,లక్ష పుష్పార్చన,కుంకుమార్చన,మంగళహారతి తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పాపన్నపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామీవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

# జొన్న జావ.. పోషకాల గని

**- సంప్రదాయ ఆహారంలో ఆరోగ్య రహస్యం - తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు**

**వేద న్యూస్ డెస్క్:**



జొన్న జావ లేదా జొన్న అంబలి అనేది పూర్వకాలం నుంచి తెలుగు ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఆరోగ్యకరమైన సంప్రదాయ పానీయం. శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఇందులో సమృద్ధిగా ఉండటంతో దీన్ని "పోషకాల గని"గా ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. జొన్నల్లో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బీ సమూహానికి చెందిన పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల శరీరానికి శక్తి, ఆరోగ్యం అందుతాయి. తక్కువ ఖర్చుతో ఇంట్లోనే సులభంగా తయారుచేసుకునే ఈ జావను ప్రతిరోజూ తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. జొన్న జావ శరీరానికి తక్షణ శక్తిని అందించడంతో పాటు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా రాత్రంతా పులియబెట్టిన తర్వాత ఇందులో మంచి బ్యాక్టీరియా ఏర్పడి ప్రోబయోటిక్ లక్షణాలు పెరుగుతాయి. ఇవి కడుపు ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా జొన్న అంబలిని తీసుకోవడం వల్ల శరీరంలోని చెడు బ్యాక్టీరియాను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి జొన్న జావ మంచి ఆహారంగా భావిస్తున్నారు. ఇందులో ఉండే అధిక ఫైబర్ కారణంగా ఎక్కువసేపు ఆకలి అనిపించదు. దీంతో అధికంగా తినే అలవాటు తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. అలాగే మధుమేహం ఉన్నవారికి కూడా ఇది ఉపయోగకరమైన ఆహారంగా భావిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇది సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎముకల బలానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు కూడా ఇందులో ఉండటం ప్రత్యేకత. వేసవి కాలంలో జొన్న జావ శరీరానికి చలవను అందించి అలసటను తగ్గిస్తుంది. జొన్న పిండి, నీరు, మజ్జిగతో కేవలం ఐదు నిమిషాల్లో తయారయ్యే ఈ పానీయం శక్తివంతమైన అల్పాహారంగా పనిచేస్తుంది. దీనిలో ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు, కొత్తిమీర కలిపి తీసుకుంటే రుచి మరింత పెరుగుతుంది. ఉదయాన్నే జొన్న జావ తాగితే టిఫిన్ అవసరం లేకుండా శరీరానికి కావలసిన శక్తి అందుతుందని నిపుణులు సూచిస్తున్నారు. సంప్రదాయ ఆహారాన్ని తిరిగి మన జీవనశైలిలోకి తీసుకురావడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు చెబుతున్నారు.

# నడక, సైక్లింగ్‌తో ఆరోగ్యం పర్యావరణానికి మేలు






**- వ్యాయామం వాతావరణ మార్పుకు పరిష్కారం - వాహనాల వినియోగం తగ్గితే కార్బన్ ఉద్గారాలు తగ్గింపు**

**వేద న్యూస్ డెస్క్:**

నడక, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించే శారీరక వ్యాయామ కార్యక్రమాలు వాతావరణ మార్పులను తగ్గించడంలోనే కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని, సమాజంలో సమానత్వాన్ని కూడా మెరుగుపరచగలవని తాజా అధ్యయనం వెల్లడించింది. న్యూజిలాండ్‌కు చెందిన ఆక్లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు రూపొందించిన "ఫిజికల్ యాక్టివిటీ అండ్ క్లైమేట్ చేంజ్ మోడల్" అనే కొత్త భావనాత్మక వ్యవస్థ ఈ అంశంపై మార్గదర్శకంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ మోడల్ వివరాలు ప్రముఖ వైద్య పరిశోధనా పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం శారీరక వ్యాయామం మరియు వాతావరణ మార్పు సమస్యలను వేర్వేరుగా కాకుండా కలిసి పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ప్రజలు రోజువారీ జీవితంలో నడక, సైక్లింగ్ వంటి కార్యకలాపాలను పెంచితే వాహనాల వినియోగం తగ్గి కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. అదే సమయంలో శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ప్రస్తుతం ప్రజలను శారీరకంగా చురుకుగా ఉండేలా చేసే ప్రయత్నాలు సరిపోవడం లేదని పరిశోధకులు పేర్కొన్నారు. అధ్యయనం ప్రకారం హీట్‌వేవ్స్, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు బయటకు వెళ్లి వ్యాయామం చేయడానికి అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో నడక, సైక్లింగ్ వంటి అలవాట్లు తగ్గుతున్నాయి. మరో పరిశోధనలో 68 దేశాల సమాచారాన్ని విశ్లేషించగా ధనిక దేశాల్లో సంపన్న పురుషులకు వినోదాత్మక వ్యాయామ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పేద దేశాల్లో మహిళలకు అవి చాలా తక్కువగా ఉన్నాయని తేలింది. ఈ రెండు వర్గాల మధ్య వ్యత్యాసం సుమారు 40 శాతం వరకు ఉందని వెల్లడైంది. ఇక 200 దేశాల్లో 2004 నుంచి 2025 వరకు రూపొందించిన 661 జాతీయ విధానాలను పరిశీలించిన మరో అధ్యయనం ప్రకారం, చాలా దేశాలు శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించే విధానాలను రూపొందించినప్పటికీ వాటి అమలు మాత్రం చాలా తక్కువగా ఉంది. మొత్తం విధానాల్లో కేవలం 38.7 శాతం మాత్రమే ఆరోగ్యం, విద్య వంటి పలు శాఖలను కలిపి అమలు చేయడానికి చర్యలు తీసుకున్నాయి. నడక, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించే విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా వాతావరణ మార్పును తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధకులు సూచిస్తున్నారు.

# బ్లాక్‌హెడ్స్ సమస్యకు సహజ పరిష్కారాలు



- చర్మ రంధ్రాలు మూసుకుపోతే బ్లాక్‌హెడ్స్
- సహజ చిట్కాలతో తగ్గే అవకాశం
- శుభ్రత, సరైన చర్మ సంరక్షణ అవసరం

వేద న్యూస్ డెస్క్ :

చాలామంది ఎదుర్కొనే సాధారణ చర్మ సమస్యల్లో బ్లాక్‌హెడ్స్ ఒకటి. ముఖ్యంగా ఆయిల్ చర్మం ఉన్నవారిలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణంగా ముక్కు, గడ్డం, నుదురు ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా ఏర్పడతాయి. చర్మపు రంధ్రాలు అధిక ఆయిల్, మృత కణాలు, ధూళితో మూసుకుపోయినప్పుడు బ్లాక్‌హెడ్స్ ఏర్పడతాయి. రంధ్రాల్లో చిక్కుకున్న పదార్థం గాలిలోని ఆక్సిజన్‌తో ప్రతిచర్యకు లోనై నలుపు రంగులోకి మారడం వల్ల ఇవి కనిపిస్తాయి. ఈ పరిస్థితిని వైద్యపరంగా మొటిమల సమస్యలో భాగంగా పరిగణిస్తారు. బ్లాక్‌హెడ్స్‌ను తగ్గించడంలో కొన్ని సహజ చిట్కాలు ఉపయోగపడవచ్చు. తేనె, నిమ్మరసం మిశ్రమం చర్మానికి సహజ శుభ్రతను అందిస్తుంది. ఒక టీ స్పూన్ తేనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతాల్లో రాసి 10 నుంచి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే చర్మ రంధ్రాలు శుభ్రపడతాయి. అలాగే ముఖానికి ఆవిరి పట్టడం ద్వారా కూడా రంధ్రాల్లో ఉన్న మలినాలు బయటకు రావడానికి సహాయపడుతుంది. వేడి ఆవిరి వల్ల చర్మం మృదువుగా మారి రంధ్రాలు తెరుచుకుంటాయి. బేకింగ్ సోడా కూడా బ్లాక్‌హెడ్స్ తగ్గించడంలో సహాయపడుతుంది. కొద్దిగా బేకింగ్ సోడాలో నీరు కలిపి పేస్ట్‌లా చేసి బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతాల్లో మృదువుగా రాసి ఒక నిమిషం పాటు మసాజ్ చేసి కడిగితే చర్మంపై పేరుకున్న మలినాలు తొలగిపోతాయి. అలాగే అలోవెరా జెల్ చర్మాన్ని శాంతింపజేసి తేమను అందిస్తుంది. తాజా అలోవెరా జెల్‌ను ముఖానికి రాసి కొద్దిసేపటి తర్వాత కడిగితే చర్మంలోని ఆయిల్ తగ్గి రంధ్రాలు మూసుకుపోకుండా సహాయపడుతుంది. గ్రీన్ టీ ఆకులతో చేసే మృదువైన మసాజ్ కూడా చర్మాన్ని శుభ్రంగా ఉంచడంలో ఉపయోగపడుతుంది.

# గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదమా?



- **హార్మోన్లపై ప్రభావం చూపే మాత్రలు**
- **కొంతమేర ప్రమాదం కానీ తాత్కాలికమే**
- **వైద్యుల సూచనలతోనే వాడాలి**

**మన గళం, ఆరోగ్యం :**

గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. గర్భధారణను నివారించేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగించే ఈ మాత్రలు శరీరంలోని హార్మోన్లను ప్రభావితం చేసి పనిచేస్తాయి. అయితే ఇవి నిజంగా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా అనే అంశంపై అనేక పరిశోధనలు జరిగాయి. అందులో కొన్ని విషయాలు స్పష్టమయ్యాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించే పరిశోధనా సంస్థల నివేదికల ప్రకారం గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి కంబైన్డ్ మాత్రలు, ఇందులో ఈస్ట్రోజెన్ మరియు ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. మరొకటి మినీ మాత్రలు, ఇందులో కేవలం ప్రొజెస్టోజెన్ మాత్రమే ఉంటుంది. ఈ మాత్రలు మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మార్చి అండోత్పత్తిని నియంత్రించడం ద్వారా గర్భధారణను నివారించడంలో సహాయపడతాయి. పరిశోధనల ప్రకారం కంబైన్డ్ గర్భనిరోధక మాత్రలు తీసుకునే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొద్దిగా పెరిగే అవకాశం ఉందని సూచనలు ఉన్నాయి. అయితే ఈ ప్రమాదం ఎక్కువ కాలం కొనసాగదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఈ మాత్రలను తీసుకోవడం ఆపిన తర్వాత కొంతకాలానికి శరీరం మళ్లీ సహజ స్థితికి చేరుకుంటుంది. దాదాపు పది సంవత్సరాల తర్వాత ఈ ప్రమాదం మాత్రలు ఎప్పుడూ వాడని వారితో సమానంగా మారుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే మరోవైపు ఈ మాత్రలు కొన్ని క్యాన్సర్ రకాల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గర్భాశయ లోపలి పొర క్యాన్సర్ మరియు గర్భాశయ గడ్డల క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గించడంలో ఇవి ఉపయోగకరంగా ఉండొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి నిపుణులు సూచిస్తున్నారు.

# టీ తాగితే ఆరోగ్యానికి మేలు

**శరీరానికి శక్తి ఇచ్చే పానీయం యాంటీఆక్సిడెంట్ల సమృద్ధి**




**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రతిరోజూ తాగే పానీయాల్లో టీ ఒకటి. ఉదయం లేవగానే టీ తాగడం చాలామందికి అలవాటు. సరైన పరిమితిలో టీ తీసుకుంటే శరీరానికి కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా టీ ఆకుల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని రోగాల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. టీ తాగడం వల్ల అలసట తగ్గి శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే కేఫిన్ మెదడు చురుకుదనాన్ని పెంచి ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే గ్రీన్ టీ వంటి కొన్ని రకాల టీలు శరీరంలోని చెడు కొవ్వును తగ్గించడంలో సహాయ పడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా టీ కొంత మేర ఉపయోగపడుతుంది. టీ లో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను రక్షించి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. కొందరికి జీర్ణక్రియ మెరుగుపడటానికి కూడా టీ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా అల్లం టీ, నిమ్మ టీ వంటి రకాల టీలు జలుబు, గొంతు సమస్యల సమయంలో ఉపశమనం కలిగించవచ్చు. అయితే టీని అధికంగా తీసుకోవడం మంచిది కాదు. ఎక్కువ కేఫిన్ తీసుకోవడం వల్ల నిద్రలేమి, ఆందోళన వంటి సమస్యలు రావచ్చు. అందువల్ల రోజుకు రెండు లేదా మూడు కప్పుల వరకు మాత్రమే టీ తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. సరైన పరిమితిలో టీ తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని వారు చెబుతున్నారు.

# ‘విత్ లవ్’ బ్యూటీ కావ్యా అనిల్ గురించి మీకు తెలుసా?

**వేద న్యూస్ డెస్క్:**

ఇటీవల విడుదలైన విత్ లవ్ సినిమా యూత్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధిస్తోంది. ఈ యూత్‌ఫుల్ లవ్ స్టోరీలో ప్రధాన తారలతో పాటు ఓ కొత్త అమ్మాయి తన సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆమే కావ్యా అనిల్. చిన్న పాత్రతోనే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ నటి గురించి ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. దర్శకుడు మధన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరోగా అభిషన్ జీవింత్ నటించగా, హీరోయిన్‌గా అనస్వర రాజన్ తన నటనతో మెప్పించారు. అయితే సినిమాలో ‘అనీషా’ అనే ముస్లిం అమ్మాయి పాత్రలో కనిపించిన కావ్యా అనిల్, తన అమాయకత్వం, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేసింది. కథలో ఆమె పాత్రకు పెద్దగా స్క్రీన్ టైమ్ లేకపోయినా, కనిపించిన ప్రతి సన్నివేశంలోనే తన ప్రభావాన్ని చూపించి గుర్తింపు తెచ్చుకోవడం విశేషం. సినిమాలో కావ్యా ఎక్కువగా స్కూల్ యూనిఫామ్, బురఖా, సంప్రదాయ పంజాబీ దుస్తుల్లో కనిపించింది. ఈ లుక్‌లో ఆమె చాలా సహజంగా కనిపించడం, పాత్రకు పూర్తి న్యాయం చేయడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా యువత ఆమె పాత్రతో బాగా కనెక్ట్ అవుతోంది. సోషల్ మీడియాలో ఆమె ఫోటోలు, వీడియో క్లిప్స్ వైరల్ అవుతుండగా, “ఈ అమ్మాయి ఎవరు?” అనే ప్రశ్నతో నెటిజన్లు గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారు. కావ్యా అనిల్ అసలు కేరళకు చెందిన మలయాళీ నటి. సినిమాల్లోకి అడుగుపెట్టే ముందు ఆమె కొన్ని షార్ట్ ఫిల్మ్స్‌లో నటించి తన టాలెంట్‌ను నిరూపించుకుంది. ఆ అనుభవమే ఆమెకు ఈ సినిమాలో మంచి నటన కనబర్చడానికి సహాయపడింది. మొదటి సినిమా అయినప్పటికీ ఎక్కడా కొత్తగా అనిపించకుండా, చాలా సహజంగా నటించడం ఆమెకు పెద్ద ప్లస్‌గా మారింది. ప్రేక్షకులు మాత్రమే కాకుండా సినీ వర్గాలు కూడా ఆమె నటనను ప్రశంసిస్తున్నాయి. సీనియర్ నటి అనస్వర రాజన్‌తో కలిసి నటించినప్పటికీ, ఎక్కడా తక్కువగా కనిపించకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సృష్టించుకుంది. ఇది ఒక కొత్త నటికి చాలా పెద్ద విజయంగా చెప్పుకోవచ్చు. ఇక ఈ సినిమా సక్సెస్‌తో కావ్యా అనిల్‌కు మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని కొత్త ప్రాజెక్టుల కోసం ఆమెను సంప్రదిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. సరైన కథలు, మంచి పాత్రలు ఎంచుకుంటే, తక్కువ కాలంలోనే ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదగగల సామర్థ్యం ఉందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి, విత్ లవ్ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన కావ్యా అనిల్, తన మొదటి ప్రయత్నంతోనే మంచి ఇంపాక్ట్ సృష్టించింది. చిన్న పాత్ర అయినా గుర్తుండిపోయేలా చేయడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. ఇక ముందు ఆమె నుంచి మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# ‘ధురంధర్ 2’ రికార్డుల వర్షం



**వేద న్యూస్ డెస్క్:**

మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ ‘ధురంధర్ 2’ విడుదలైన తొలి రోజే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రం ప్రీమియర్ షోల నుంచే రికార్డు స్థాయి వసూళ్లను నమోదు చేసింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రీమియర్ షోల ద్వారానే ఈ సినిమా ఇండియాలో సుమారు నలభై మూడు కోట్ల రూపాయల నెట్ వసూళ్లు సాధించింది. దీంతో ప్రీమియర్ షోల ద్వారా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా ఇది కొత్త రికార్డు సృష్టించింది. విడుదలైన తొలి రోజే దేశవ్యాప్తంగా భారీ ఓపెనింగ్స్ దక్కించుకున్న ఈ చిత్రం, ఫస్ట్ డే ముగిసే సరికి సుమారు నూర నలభై ఆరు కోట్ల రూపాయల నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఫస్ట్ డేలోనే నూరు కోట్ల మార్క్ దాటిన తొలి హిందీ సినిమాగా ఇది చరిత్ర సృష్టించింది. ఇందులో హిందీ వెర్షన్ నుంచే నూర మూడు కోట్లకు పైగా వసూళ్లు రావడం విశేషం. ఈ రికార్డులతో జవాన్, పఠాన్, యానిమల్ వంటి భారీ ఓపెనింగ్ సినిమాల రికార్డులను అధిగమించింది.సునామీ సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కిరణ్ అబ్బవరం ఓటీటీ ఎంట్రీ

**వేద న్యూస్ డెస్క్:**




వరుస విజయాలతో జోరుమీదున్న యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు ఓటీటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. ఆయన నటిస్తున్న తొలి వెబ్ సిరీస్ ‘గువ్వల చెరువు ఘాట్’ ఫస్ట్ లుక్ తాజాగా విడుదలై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముంబైలో నిర్వహించిన ‘ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ 2026’ ఈవెంట్‌లో ఈ సిరీస్ గ్లింప్స్‌ను అధికారికంగా విడుదల చేశారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో, గువ్వల చెరువు ఘాట్ ప్రాంతం ఆధారంగా ఈ కథ రూపొందుతోంది. ఇది ఒక ఇంటెన్స్ పొలిటికల్ రివేంజ్ డ్రామాగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ‘డియర్ కామ్రేడ్’ సిని మాతో గుర్తింపు పొందిన దర్శకుడు భరత్ కమ్మ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్‌లో కిరణ్ అబ్బవరం మాస్, రగ్గడ్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నాడు.

# ఓటీటీలోకి వచ్చేసిన ‘విష్ణు విన్యాసం’.. ఎక్కడ చూడాలి?

**వేద న్యూస్ డెస్క్:**

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న శ్రీ విష్ణు నటించిన విష్ణు విన్యాసం సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. గత నెల థియేటర్లలో విడుదలై మంచి టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం, తాజాగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లోకి అడుగుపెట్టింది. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకుంది. మార్చి 20 అర్ధరాత్రి నుంచే ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేయడం విశేషం. దీంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించింది. కథ విషయానికి వస్తే.. ఇందులో శ్రీ విష్ణు ఓ జూనియర్ లెక్చరర్ పాత్రలో కనిపిస్తాడు. జాతకాలు, మూఢనమ్మకాలపై అతనికి అపారమైన నమ్మకం ఉంటుంది. ఈ కారణంగా 30 ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోవడానికి ముందుకు రాడు. ఇదే సమయంలో లెక్చరర్ మనీషా పాత్రలో నటించిన నయనసారిక అతన్ని చూసి తొలిచూపులోనే ప్రేమలో పడుతుంది. ఆమె ప్రవర్తన కూడా కొంత విభిన్నంగా ఉండటం కథకు కొత్త మలుపు తీసుకువస్తుంది.మొదట ఆమెను పట్టించుకోని విష్ణు, తరువాత ఆమె ప్రేమను అంగీకరిస్తాడు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. కానీ అదే సమయంలో మనీషా ఒక కీలకమైన నిజాన్ని వెల్లడిస్తుంది. ఆ ఒక్క నిజం వీరిద్దరి జీవితాలను పూర్తిగా మార్చేస్తుంది. ఆ నిజం ఏమిటి? చివరకు వీరిద్దరూ ఒక్కటయ్యారా లేదా? అనేది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.




# సన్‌రైజర్స్‌కు భారీ షాక్



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆస్ట్రేలియాకు చెందిన యువ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయం కారణంగా మొత్తం సీజన్‌కు దూరమయ్యాడు. మార్చి 28న టోర్నీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పరిణామం జట్టులో ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో జాక్ ఎడ్వర్డ్స్‌ను సన్‌రైజర్స్ యాజమాన్యం రూ. 3 కోట్లకు దక్కించుకుంది. అతనికి ఇది తొలి ఐపీఎల్ ఒప్పందం కావడం విశేషం. అయితే గాయం తీవ్రత కారణంగా కోలుకోవడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో ఈ సీజన్ మొత్తానికి దూరమైనట్లు సమాచారం. గాయం స్వరూపంపై మాత్రం ఫ్రాంచైజీ ఇంకా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.గతంలో ఇండియా-ఏ జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా-ఏ తరపున అద్భుతమైన ప్రదర్శనతో ఎడ్వర్డ్స్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఏడాది జనవరి 29న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తరపున టి20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం కూడా చేశాడు. ఇప్పటికే జట్టు సమతుల్యతపై ఈ గాయం ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అతని స్థానంలో ఎవరిని ప్రత్యామ్నాయ ఆటగాడిగా ఎంపిక చేస్తారో ఆసక్తికరంగా మారింది. మరోవైపు జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయంతో పూర్తిగా కోలుకోకపోవడంతో ప్రారంభ మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నాడు. ఈ పరిస్థితిలో భారత వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. అతనికి ఉప కెప్టెన్‌గా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు కీలక ఆటగాళ్లు గాయాల బారిన పడటం జట్టుకు సవాల్‌గా మారగా, కొత్త కాంబినేషన్‌తో బరిలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ప్రపంచకప్ లక్ష్యంగా జట్టు సిద్ధం

**వేద న్యూస్ డెస్క్:**



వన్డే ప్రపంచకప్ 2027ను లక్ష్యంగా పెట్టుకుని భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పటినుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోంది. జట్టు ఎంపిక, ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శన వంటి అంశాలను నిశితంగా పరిశీలిస్తూ సుమారు ఇరవై మంది ఆటగాళ్లతో ప్రాబబుల్స్ జాబితాను సిద్ధం చేసే పనిలో ఉంది. ఈ క్రమంలో శుభ్‌మన్ గిల్ నాయకత్వం, అలాగే సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తు కూడా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వన్డే, టెస్ట్ జట్లకు గిల్ నాయకత్వం వహిస్తున్నప్పటికీ, అతని కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. విదేశీ పర్యటనల్లో పరాజయాలు, స్వదేశంలో ఎదురైన కొన్ని ఓటములు ఎంపికదారుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో జట్టును మరింత బలోపేతం చేసే దిశగా బోర్డు దృష్టి సారించింది. ఇక ఐపీఎల్ 2026 సీజన్ కీలకంగా మారింది. సెలక్షన్ కమిటీ సభ్యులు మ్యాచ్‌లను ప్రత్యక్షంగా, టెలివిజన్ ద్వారా వీక్షిస్తూ ఆటగాళ్ల ఫామ్, ఫిట్‌నెస్‌ను అంచనా వేయనున్నారు. ముఖ్యంగా యువ ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా జట్టులో చోటు కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రక్రియలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని కమిటీ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రాబబుల్స్ జాబితాలో గిల్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్ వంటి కీలక ఆటగాళ్లు ఉండే అవకాశముంది. కొత్త ప్రయోగాల కంటే స్థిరమైన జట్టుతోనే ముందుకు వెళ్లాలనే దృక్పథం కనిపిస్తోంది. టెస్ట్ క్రికెట్ విషయంలో కూడా పెద్దగా ప్రయోగాలు చేయకుండా ప్రధాన బౌలర్లను కొనసాగించే ఆలోచనలో బోర్డు ఉంది. ఇక సీనియర్ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్తు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఇతర ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరూ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. ఇటీవల ప్రదర్శన స్థిరంగా ఉన్నప్పటికీ, ప్రతి మ్యాచ్ వారి కెరీర్‌కు కీలకంగా మారుతోంది. ప్రపంచకప్ జట్టులో వీరికి స్థానం దక్కుతుందా లేదా అన్నది ఎంపికదారుల నిర్ణయంపై ఆధారపడి ఉంది. మరోవైపు జూన్‌లో ఆఫ్ఘానిస్థాన్‌తో జరగనున్న సిరీస్ కూడా కీలకంగా మారనుంది. ఆ సిరీస్‌లో ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా ప్రపంచకప్ జట్టుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా అనుభవం, యువత కలయికతో బలమైన జట్టును తయారు చేసి 2027 ప్రపంచకప్‌ను సాధించాలనే లక్ష్యంతో భారత జట్టు ముందుకు సాగుతోంది.

# అగార్కర్ కాంట్రాక్ట్‌పై క్లారిటీ

**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తన పదవీకాలాన్ని 2027 వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించాలని బీసీసీఐను కోరినట్టు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టమైంది. ఈ ప్రచారాన్ని బీసీసీఐకి చెందిన ఒక సీనియర్ అధికారి పూర్తిగా ఖండించారు. సమాచారం ప్రకారం, అగార్కర్ ఈ విషయంపై బోర్డుతో ఎలాంటి చర్చలు జరపలేదని, అలాగే ప్రత్యేకంగా పొడిగింపు కోరాల్సిన అవసరం కూడా లేదని వెల్లడించారు. 2023లో సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అగార్కర్ హయాంలో భారత్ 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లతో పాటు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం విశేషం. సెలెక్షన్ కమిటీ అనేది బీసీసీఐకి చెందిన ఉప కమిటీగా పనిచేస్తుంది. ప్రస్తుత సెలెక్టర్ల కాంట్రాక్ట్ ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగియనుంది. ఆ తర్వాత అగార్కర్ కొనసాగింపుపై బీసీసీఐ కార్యదర్శి మరియు అగార్కర్ మధ్య చర్చలు జరిగి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఒక సీనియర్ సెలెక్టర్ గరిష్టంగా నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగవచ్చు. ఈ నేపథ్యంలో అగార్కర్ ప్రత్యేకంగా కాంట్రాక్ట్ పొడిగింపు కోరాల్సిన అవసరం లేదని బోర్డు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073